## క్లుప్తంగా

### నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


8వ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న కోలగట్ల

**విజయనగరం:** నగరంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలో రూ.58 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. 7,8,9 డివిజన్లలో రహదారులు, కల్వర్టుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా 9వ డివిజన్‌లో రాజ్యలక్ష్మి థియేటర్ వద్ద ఉన్న పాఠశాలలో తాగునీటి సమస్యను ఉపాధ్యాయులు డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకురాగా.. తాగునీటి బోరు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే 7వ డివిజన్‌లో దివ్యాంగురాలు బూర లీలకు ట్రైసైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, జోనల్ ఇన్‌ఛార్జిలు అల్లు చాణిక్య, గుజ్జల నారాయణరావు, కోలగట్ల కృష్ణారావు, రెడ్డి గురుమూర్తి, బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, సయ్యద్ గౌస్, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్లపై విషం చిమ్మడం తగదు

**విజయనగరం:** గ్రామ వలంటీర్లు నిస్వార్థ సేవకులని రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు సలహాలతో వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషం చిమ్మితే సహించేది లేదని, ప్రజలంతా తిరగబడతారని హెచ్చరించారు. వలంటీర్ల చేపడుతున్న నిరసనకు బుధవారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయంతో సంబంధం లేకుండా నిజాయితీగా, క్రమశిక్షణగా పనిచేస్తూ, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తున్న వలంటీర్లపై విషం చిమ్మడం తగదన్నారు. తక్షణమే పవన్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జోనల్ ఇన్‌ఛార్జిలు కోలగట్ల కృష్ణారావు, ముచ్చు శ్రీను, అల్లు చాణక్య, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### సృష్టి మనుగడకు ఆధారభూతుడు శ్రీకృష్ణపరమాత్మ

- విశాఖ ఇస్కాన్ టెంపుల్ నిథైశ్వని మాతాజీ


మాట్లాడుతున్న విశాఖ ఇస్కాన్ టెంపుల్ నిథైశ్వని మాతాజీ

**విజయనగరం:** సృష్టిలో ప్రాణికోటి మనుగడకు ఆధారభూతుడు శ్రీకృష్ణ పరమాత్మేనని విశాఖ ఇస్కాన్ టెంపుల్ నిథైశ్వని మాతాజీ ఉద్బోధించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిథైశ్వని మాతాజీ హాజరై నూతన కార్యవర్గానికి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ సకల చరాచర జగత్తు శ్రీకృష్ణ పరమాత్మ సృష్టిలో భాగమేనని, ఈ ప్రాణికోటి మునగడంతా ఆయన మీదే ఆధారపడి ఉందని భావించినప్పుడు అహంకారానికి, రాగద్వేషాలకు తావుండదని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృష్ణ శాంతి రోటరీ క్లబ్ అధ్యక్షురాలిగా నీతా విజ్వానీ కార్యదర్శిగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్కే జైన్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. మొదటి సేవా కార్యక్రమంగా పేద మహిళకు కుట్టు మిషన్ ఉచితంగా అందజేశారు. లక్ష 11 వేల రూపాయలు నగదు పోలియో నిర్మూలన నిధికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.కృష్ణ శాంతి, నీతా విజ్వాని, గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, మండా రవి, రోటరీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### జగనన్న సురక్షపై సమీక్ష

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని సీతారామునిపేట గ్రామంలో ఈ నెల 20న జరగనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై స్థానిక సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు మిరప శాంతికుమారి తదితరులు సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. వారు మాట్లాడుతూ వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి వాళ్లకి అవసరమైన సేవలను అడిగి తెలుసుకోవాలన్నారు. సర్వే చేపట్టి అర్హుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాంబార్కి రామారావు, సత్యం, పైడినాయుడు, శ్రీను, పరిసినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకులపై నిందలా?

'సినీ హీరోగా పవన్ కళ్యాణ్‌ను అభిమానించే వారిలో మేమూ ఉన్నాం. ఆయన అభిమానులం. కానీ, ఇటీవల ఏలూరు సభలో ఆయన చేసిన వ్యాఖ్యలపై సిగ్గు పడుతున్నాం. రాజకీయాలు చేయాలనుకుంటే.. మరోలా చేసుకోవాలి. ప్రజా సేవ చేస్తున్న మమ్మల్ని కించపరిచేలా మాట్లాడటం తగదు. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలి. లేదంటే తగిన గుణపాఠం చెబుతాం'.. అంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో పవన్ దిష్టిబొమ్మలు, చిత్రపటాలను దగ్ధం చేస్తూ నిరసన గళం వినిపిస్తున్నారు. వారికి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘీభావం ప్రకటిస్తున్నారు. వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలను తప్పు పడుతున్నారు.

– సాక్షి విజయనగరం/నెల్లిమర్ల


విజయనగరం: ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు


నెల్లిమర్ల రూరల్: సతివాడ జంక్షన్‌లో పవన్ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

### వలంటీర్‌లో సీఎంను చూసుకుంటున్నాను


రజక వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నాకు రెండు కిడ్నీలు పాడై ఇంటికే పరిమితమయ్యాను. మందుల ఖర్చు కోసం డబ్బులు లేక ఆరోగ్యం క్షీణించి ఇబ్బందులు పడుతున్న నాకు వలంటీర్ బాలాకుమార్ నేరుగా ఇంటికే వచ్చి పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. ప్రస్తుతం నాకు నెలకి రూ.10 వేలు పింఛన్ అందుతోంది. ఆ డబ్బులు డయాలసిస్‌కు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వలంటీర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసుకుంటున్నాను. మంచి పనులు చేస్తున్న వలంటీర్ల మీద నిందలు వేయడం మంచిది కాదు.

– అదపాక కందియ్య, సతివాడ గ్రామం, నెల్లిమర్ల మండలం

### వలంటీర్లను విమర్శించడం తగదు


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సంక్షేమ పథకాల ద్వారా ఎంతో లబ్ధిపొందాం. అమ్మఒడి ద్వారా ఇప్పటివరకు రూ. 55 వేలు లబ్ధి పొందాను. రూ.18 వేలు డ్వాక్రా రుణ మాఫీ కూడా జరిగింది. సంక్షేమ పథకాలు పొందేందుకు నేను ఎక్కడికీ వెళ్లలేదు. వలంటీర్ నేరుగా మా ఇంటికి వచ్చి సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు అర్హురాలిగా నన్ను గుర్తించారు. సేవలందిస్తున్న వలంటీర్లను పవన్ కల్యాణ్ విమర్శించడం తగదు.

– కొమ్మూరు రాధ, భోగాపురం

### వలంటీర్ వ్యవస్థతో ఎంతో మేలు


వలంటీర్ వ్యవస్థను పెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలాంటి ఎంతో మందికి మేలు చేశారు. కీళ్ల వాతం ఉండడంతో అడుగు తీసి అడుగు వేయలేను. ఇంటికే పరిమితమైన నాకు వలంటీర్ ప్రతీ నెల ఒకటో తేదీన కోడి కూయక ముందే వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నాడు. వలంటీర్లు లేకపోతే నాలాంటి వారి పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. అవగాహన లేకుండా మాట్లాడడం మంచి పద్ధతి కాదు. మా దగ్గరికి పవన్ కల్యాణ్ వచ్చి అడిగితే మేమే తగిన సమాధానం చెబుతాం.

– పతివాడ లక్ష్మీనారాయణ, కొల్లాం గ్రామం, డెంకాడ మండలం

### ఆదుకున్న సేవామూర్తులు


మేము కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకున్న సేవామూర్తులు వలంటీర్లు. కరోనా మహమ్మారితో బాధపడుతున్న సమయంలో అయినవాళ్లు కూడా దగ్గరకు రావడానికి భయపడుతున్న సమయంలో మాకు అన్ని రకాల సేవలందించి మా ప్రాణాలను నిలబెట్టారు. వారి సేవలు వెల కట్టలేనివి. రాజకీయ లబ్ధికోసం వారిపై అనవసర నిందలు మోపడం నాయకులకు పరిపాటిగా మారింది.

– తాళ్లపూడి శ్రీరాములు, చెల్లూరు గ్రామం, విజయనగరం మండలం

### పవన్ అనవసర మాటలు కట్టిపెట్టు

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్, నీవు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకో. నిస్వార్థంగా సేవలందిస్తున్న మాపై అనవసర మాటలు కట్టిపెట్టు. ఇంటింటికీ వచ్చి ప్రజలకు మేము అందిస్తున్న సేవలను వారినే అడిగి తెలుసుకుంటే వాస్తవాలు తెలుస్తాయి. నీ వ్యాఖ్యలతో ఇప్పటివరకు నీపై ఉన్న అభిమానం కాస్తా పటాపంచలైంది.


–కళ్యాణపు ఆదినారాయణ, గ్రామ వలంటీర్, చెల్లూరు గ్రామం

# అందరి సంక్షేమమే జగనన్న లక్ష్యం


'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

**విజయనగరం:** అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 48వ డివిజన్ గాజులరేగలోని రాజవీధిలో బుధవారం సాయంత్రం జరిగిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాస్పందనను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వీధి దీపాలు సరిగా లేవని స్థానికులు చెప్పగా.. వెంటనే అక్కడ ఉన్న అధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తూ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజల ఇంటి వద్దకే చేరవేస్తున్నారన్నారు. నగర అభివద్ధికి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. నగరంలోని ప్రధాన జంక్షన్ల అభివద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్ బ్యాంకుల ఏర్పాటు వంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సీడింగ్ తప్పనిసరి

**నెల్లిమర్ల రూరల్:** కార్మిక రాజ్య బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులు తమ ఖాతాలను ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలని ఆ సంస్థ విజయనగరం బ్రాంచ్ మేనేజర్ ఎం.ఎ.బేగ్ కోరారు. పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో చేపట్టిన ఆధార్ సీడింగ్ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారంతా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. దేశంలో ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య చికిత్స చేసుకునే వీలుంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం


ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య విద్యార్థులు

**విజయనగరం ఫూల్‌బాగ్:** సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆప్టొమెట్రీ విభాగం అధ్యాపకులు, వైద్య విద్యార్థులు విజయనగరం, విశాఖపట్నంనకు చెందిన 460 మందికి నేత్ర పరీక్షలు చేయగా.. 74 మందికి కంటి దోషాలు ఉన్నట్టు గుర్తించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి సిబ్బందిని, వైద్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సౌరబ్ బెనర్జీ, ఈశ్వర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వైస్ ఛాన్సలర్ వి.వి.రేవంత్, కరెస్పాండెంట్ డాక్టర్ ప్రజ్ఞా సుమ, ప్రిన్సిపాల్ రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

# 'జగనన్న సురక్ష'తో ప్రతీ కుటుంబానికి మేలు


కుమిలిలో ధ్రువపత్రాలు పత్రాలు అందచేస్తున్న ఎంపీడీఓ, తదితరులు

**పూసపాటిరేగ:** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి మేలు చేకూరుతోందని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. మండలంలోని కుమిలి-1 సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 551 మందికి వివిధ రకాలు సర్టిఫికెట్లను అందచేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. అర్హత ఉండి పథకాలు పొందలేని వారికి ఇది మంచి అవకాశమన్నారు. ప్రజలకు మరంత చేరువులో ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసురావు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఓ రత్నమాల, ఏపీఎం పెంటంనాయుడు, సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ, వైస్ సర్పంచ్ గుజ్జు సురేష్ రెడ్డి, ప్రజాప్రతినిధులు గాబు సూరప్పన్నరెడ్డి, పడాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వసతిగృహం మరమ్మతులకు రూ.10 లక్షలు


వసతిగృహంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

**చీపురుపల్లి:** పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర సమీకృత వసతిగృహంలో అత్యవసర మరమ్మతుల కోసం జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంజూరు చేశారని మండల ఇంజనీరింగ్ అధికారులు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. వసతిగృహాన్ని బుధవారం వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ వసతిగృహంలో సమస్యలు గుర్తించిన జెడ్పీ చైర్మన్ వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేశారన్నారు. రూ.10 లక్షలతో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం తదితర పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. తక్షణమే పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారి డి.రమేష్‌కు నాయకులు సూచించారు. ఎంపీటీసీ గిరడ రాందాసు, పీతల మురళి, వసతిగృహ సంక్షేమాధికారులు సత్యనారాయణ, కొండమ్మ పాల్గొన్నారు.

# శాకంబరీగా యల్లారమ్మ

**జామి:** ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ అమ్మవారు బుధవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


శాకంబరీ దేవిగా దర్శనమిస్తున్న యల్లారమ్మ

# ఐదు దశాబ్దాల కల నెలవేరిన వేళ


పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

- గేదెలవీధిలో 61 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

**విజయనగరం:** నగరంలోని 20వ డివిజన్ గేదెల వీధిలో ఎన్నో ఏళ్ల నాటి ఇళ్ల పట్టాల కల నేడు నెరవేరడంతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది. గత 50 ఏళ్లుగా పాలించిన ప్రభుత్వాలు పట్టాలు మంజూరు చేస్తామని హామీలు ఇవ్వడమే కానీ పంపిణీ చేయలేదు. 2019 ఎన్నికల సమయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇచ్చిన హామీ మేరకు గేదెలవీధిలో 61 మంది లబ్ధిదారులకు బుధవారం పట్టాలు మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులు కోలగట్లను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ఎక్కడా ఎలాంటి అవినీతి, లంచగొండితనం లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందుతున్నాయన్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవచేసేందుకే తానెప్పుడూ పరితపిస్తుంటానన్నారు. గేదెల వీధి వాసుల వినతి మేరకు అధికారులతో మాట్లాడి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ కంటభుక్త తవిటి రాజు, కనకల నాగవల్లి, నాగవంశం డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, పైడితలమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ నక్క జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఉనికి కోసం టీడీపీ నేతల పాట్లు


పెద బూరాడపేట గ్రామంలో చేరికలను ఖండిస్తున్న సర్పంచ్ తవుడమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఉత్తుత్తి చేరికలతో అభాసుపాలు
- టీడీపీ ప్రచారాన్ని ఖండించిన పెదబూరాడపేట వైఎస్సార్‌సీపీ నేతలు

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని పెద బూరాడపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన కుటుంబాలు టీడీపీలో చేరాయంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. టీడీపీకి చెందిన కుటుంబాలకే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. పెద బూరాడపేట గ్రామంలో సర్పంచ్ మక్కువ తవుడమ్మ, నాయకులు కర్రి సత్యం, కలిగి వెంకటరావు, వెంకటరమణ తదితరులు బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలు ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గు చేటు అని విమర్శించారు. ఆ పార్టీకు చెందిన వారికే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ వాళ్లు టీడీపీలో చేరారని చెప్పుకోవడం భావ్యం కాదన్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎటువంటి చేరికలు జరగలేదని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్

- స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- 44 అంశాలపై సభ్యుల ఆమోదం


హాజరైన అధికారులు

**విజయనగరం:** గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఈ పనుల్లో రాజీపడొద్దని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వీవీ రాజేష్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 45 అంశాలతో కూడిన అజెండాపై చర్చించారు. అందులో 44 అంశాలను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామని, అందుకు అనుగుణంగా నూతన ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అదేవిధంగా సభ్యులందరి సహాయ, సహకారాలతో నగరాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. నగర శుభ్రత, అభివృద్ధే ధ్యేయంగా సమావేశంలో చర్చించటం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ ప్రాంతాల్లో 34 రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు కమిటీ ఆమోదం తెలిపినట్లు వివరించారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించటం జరిగిందని, ఇప్పటికే గుణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌కు తరలించే చెత్తను విశాఖకు తరలించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. తద్వారా పారిశుధ్య నిర్వహణకు చేసే ఖర్చు సైతం తగ్గే అవకాశం ఉందని, గుణుపూరుపేట పరిసర ప్రాంతాల్లో కాలుష్యం తగుతుందన్నారు. సమావేశంలో అధికారులు అజెండా రూపకల్పన విషయంలో నిర్లక్ష్యం తగదని సూచించారు. పూర్తి వివరాలుతో సకాలంలో అజెండాలోని అంశాలను పొందుపరచాలని చెప్పారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, పిన్నింటి కళావతి, బోనెల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.